నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 13 ఏప్రిల్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

పండుగలా సాగాలి..

పెబ్బేరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, హాజరైన పార్టీ శ్రేణులు

- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి
- నిత్యం ప్రజా సమస్యలపై పోరాడాలి
- బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపు
- పెబ్బేరు ఉమ్మడి మండల నేతలతో సన్నాహక సమావేశం

పెబ్బేరు, ఏప్రిల్ 12 : పండుగలా ఈ నెల 27వ తేదీన వరం గల్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు తర లివాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి పెబ్బేరులో జరిగిన బీఆర్ఎస్ ఉమ్మడి మండల కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ సభ శంఖారావం పూరిస్తుందని ఆయన చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాల నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో గులాబీ పార్టీ సత్తా చాటడం ఖాయమని, ఈ మేరకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుంటూ అండగ ఉండాలని సూచించారు. కార్యకర్తలు ప్రజల పక్షాన నిలబడాలని, ప్రభుత్వపరంగా అన్యాయం జరిగితే ఎదుర్కొని న్యాయం చేయాలని తెలిపారు. బాధితుల్లో ధైర్యం నింపి వారికి అండగా నిలబడాలన్నారు. సహజంగా అధికారంలో ఉన్నవారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుకూల వాతావరణం ఉంటుందని, కానీ ఇందుకు భిన్నంగా ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికిప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని సర్వేల్లో వెల్లడవుతోందన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొని, స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. కేసీఆర్ కొట్లాడి రాష్ట్రాన్ని సాధించి పదేండ్లలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపారని గుర్తుచేశారు. వరి పండించడంలోనూ నెంబర్‌వన్ స్థానానికి ఎదిగి, దేశానికే అన్నం పెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ కార్యకర్తల ఇంట్లో పండుగ వాతావరణంలో సాగాలని కోరారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి శ్రీధర్, మీడియా సెల్ కన్వీనర్ అశోక్, పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల నాయకులు దిలీప్‌రెడ్డి, కర్రెస్వామి, సాయినాథ్, వెంకటేశ్, రాజశేఖర్, వెంకటస్వామి, పృథ్వీరాజు, సుదర్శన్‌రెడ్డి, రమేశ్, ఎల్లారెడ్డి, గోవిందు, బాల చంద్రారెడ్డి, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వరంగల్ గులాబీమయం కావాలి

- అధిక సంఖ్యలో తరలివాలి
- ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి
- కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తి, ఏప్రిల్ 12 : వరంగల్ ఈనెల 27న గులాబీమయం కావాలని, బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఏడు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి జైపాల్ యాదవ్ రజతోత్సవ బహిరంగసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో రజతోత్సవ సభ ఉంటుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని 7మండలాలకు 35 బస్సులు కేటాయించడం జరిగిందని, ప్రతి మండలానికి 5బస్సుల చొప్పున విభజించామని, 27న గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలను ఎగురవేసి గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభకు తరలివాలని పిలుపునిచ్చారు. జెండాలు, బ్యానర్లు, టోపీలు సామగ్రి అంతా సిద్ధంగా ఉందని, గ్రామాల వారీగా పంపిణీ చేయాలని సూచించారు. బహిరంగ సభకు తరలివెళ్లే అంశంపై నేతలకు దిశా నిర్దేశం చేశారు. పండుగ మాదిరిగా రజతోత్సవానికి తరలిరావాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు విజితారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, కార్మిక సంఘ నాయకుడు సూర్యప్రకాశ్‌రావు, మాజీ కౌన్సిలర్ బావండ్ల మధు, నాయకులు రాంరెడ్డి, బాలయ్య, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

ప్రతి పల్లె నుంచి తరలిరావాలి

- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, ఏప్రిల్ 12 : రజతోత్సవ సభకు ప్రతి పల్లె నుంచి గులాబీ పార్టీ సైనికులు, రైతులు, అన్నివర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం భూత్పూర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉన్నదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే అదోగతి పాలు చేసిందని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో ఎక్కడికక్కడ ఎండగట్టాలని సూచించారు. ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసి బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. 27వ తేదీన ఉదయం 9గంటలకు నియోజకవర్గంలోని అన్ని మండలాల కార్యకర్తలు భూత్పూర్‌కు వస్తారని, ఇక్కడి నుంచి భారీ ర్యాలీగా బయలుదేరుదామని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచులు సత్తూర్ నారాయణగౌడ్, నర్సింహ్మగౌడ్, వెంకటయ్య, ఫసియొద్దీన్, నాయకులు మురళీధర్‌గౌడ్, బాల స్వామి, సురేశ్, ఆల శ్రీకాంత్‌రెడ్డి, అశోక్ గౌడ్, రాములు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సభకు సంసిద్ధం కావాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాట్లాడుతున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, ఏప్రిల్ 12 : వరంగల్ సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధం కావాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఈనెల 27వ తేదీన వరంగల్ జిల్లాలో చేపట్టే భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభకు మక్తల్ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లాని పార్టీ నాయకులు, కార్యకర్తలతో శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ 25సంవత్సరాలు పూర్తి కావొస్తున్న క్రమంలో గులాబీ దళపతి ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి పల్లె నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయంతం చేయాలని కోరారు. పదేండ్ల పాలనలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నిరంగాల్లో అగ్రభాగాన రాష్ట్రాన్ని నిలిపారని గుర్తుచేశారు. ప్రజలు అడుగక ముందే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందజేశారని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా స్థాపించిన బీఆర్ఎస్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని, వరంగల్‌లోని రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్ఎస్‌సీ మూల్యాంకనం రేట్లు పెంచాలి

- స్పాట్ కేంద్రం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఆందోళన

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 12 : పదో తరగతి మూల్యాంకనం రేట్లు పెంచాలని ఉపాధ్యాయ సంఘాల ఐకాస నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్పాట్ కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టీపీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌బాబు మాట్లాడుతూ ఒక పేపర్‌కు కేవలం రూ.10లు మాత్రమే ఇస్తున్నారని, రూ.25లు ఇవ్వాలని, స్పెషల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రూ.250ల నుంచి రూ.700లకు పెంచాలని డిమాండ్ చేశారు. నాలుగో తరగతి ఉద్యోగులకు రోజంతా పని చేస్తే కేవలం రూ.83లు ఇవ్వడం దారుణమని, కనీసం రూ. 500లు ఇవ్వాలన్నారు. చీఫ్ ఎగ్జామినర్లకు రూ.వెయ్యి ఇవ్వాలన్నారు. కేంద్రంలోని డెస్క్‌లపై వాల్యుయేషన్ చేయడం ఇబ్బందిగా ఉందని, కనీస వసతులు కల్పించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారి కమలాకర్‌శర్మకు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్, టీపీఆర్‌టీయూ, ఎస్‌టీయూ, డీటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్ఎల్‌టీఏ, ఆర్ యూటీపీ, టీఎస్‌టీయూ, టీయూటీఎఫ్, టీఆర్‌టీఎఫ్, ఏపీటీయూఎ, టీజీఎస్, బీటీఎఫ్ నాయకులున్నారు.

మన ఇంటి పార్టీ పండుగ

- అన్ని వర్గాలు వేలాదిగా తరలిరావాలి
- బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి
- సొంత ఖర్చులతో వాహనాల ఏర్పాటు
- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి
- నాగర్‌కర్నూల్‌లో చలో వరంగల్ సభ పోస్టర్ ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 12 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ.. మన ఇంటి పార్టీ పండుగ అని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఈ సభకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ సారథ్యంలో నిర్వహించే ఈ సభకు పెద్ద సంఖ్యలో.. స్వచ్ఛందంగా శ్రేణులు తరలివాలని సూచించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై, ఉద్యమ కార్యాచరణకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. సభకు తరలివెళ్లేందుకు 25 బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. మన నియోజకవర్గం నుంచి 3వేలకుపైగా పార్టీ అభిమానులను తరలించాలన్న ఉద్దేశంతో తన సొంత ఖర్చులతో వాహనాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 150 కార్లకు తగ్గకుండా ఇక్కడి నుంచి బయలుదేరాలని సూచించారు. భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున 70 క్రూయిజర్లను కూడా బుక్ చేసినట్లు తెలిపారు. అలాగే పార్టీ తరుపున కేటాయించిన 25 బస్సులు సరిపోకపోవడంతో మరో 25 బస్సులను నాగర్‌కర్నూల్ డిపో నుంచి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మర్రి వివరించారు. సభకు వచ్చే జనాభా మేరకు అవసరమైతే హైదరాబాద్ నుంచి సైతం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దాదాపు 5వేల మందిని వరంగల్ సభకు తరలించేందుకు టార్గెట్ పెట్టుకున్నామని, ఆ దిశగా ప్రయత్నం చేస్తామన్నారు. ప్రతి వాహనానికి జై తెలంగాణ, కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అనే జెండాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు చలో వరంగల్ పోస్టర్లను మర్రి జనార్దన్‌రెడ్డి ఆవిష్కరించారు.

కేసీఆర్ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం

నాడు తెలంగాణ కోసం ప్రత్యేక ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నేత కేసీఆర్ అని మర్రి అన్నారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత అన్ని విధాలా మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తు చేశారు. గతంలో ప్రాంతీయ పార్టీకి లేని చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందని, 14 ఏండ్లు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించిపెట్టిన తెలిపారు. ఉద్యమ నేతనే సీఎంగా పదేండ్లు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి దేశానికే రోల్‌మోడల్ చేశాడన్నారు. సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు, ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, పెంచిన పెంపు, బాలింతలకు కేసీఆర్ కిట్స్, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, మన ఊరు-మనబడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు మెరుగైన విద్య, విద్యార్థులకు పోషకాహారం, బీసీ బంధు, దళిత బంధుతోపాటు మత్స్యకారులకు చేపలు, యాదవులకు గొర్రెల పంపిణీ చేసి అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు అన్నారు. ప్రజలంతా మళ్లా ముఖ్యమంత్రిగా కేసీఆర్ రావాలని బలమైన ఆకాంక్షతో ఉన్నారన్నారు. సమావేశానికి నాయకులు బైకాని శ్రీనివాస్ యాదవ్, అర్థం రవి, బాలాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

- బీఆర్ఎస్ నేత హనుమంతు నాయుడు

మాట్లాడుతున్న బాసు హనుమంతు నాయుడు

గద్వాల రూరల్, ఏప్రిల్ 12 : ఈనెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని, గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని గుర్రంగడ్డ, బస్సాపురం, బీరెల్లి, లత్తీపురం గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆయన సమావేశమై మాట్లాడారు. 27న గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాలు ఎగురవేసి సభకు బయలుదేరాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గుర్రంగడ్డ గ్రామంలో బాలకృష్ణారెడ్డి, రుక్మంరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ఈదన్న, సంజీవులు, భీముడు, చంద్రారెడ్డి, దామోదర్‌రెడ్డి, రామిరెడ్డి, మాసన్న, రాముడు, బీసన్న, పుల్లన్న, శాంతన్న, సిద్దుబాబు. బస్సాపురం గ్రామం నుంచి మాజీ సర్పంచ్ రాఘవేంద్ర, పురుషోత్తంరెడ్డి, పూజారి శివన్న, వడ్డె శాంతన్న, ఆంజనేయులు, గొల్ల రాముడు, బీరెల్లి గ్రామం నుంచి డీఆర్ నాగేందర్‌రెడ్డి, స్టాలిన్, రామ్మోహన్, చాకలి మహేశ్, బీసన్న, రాజేశ్‌గౌడ్, అనీల్, కేశవ్, తెలుగు సంతోష్, నర్సింహులు, పరశురాముడు, జగదీశ్, బతుకన్న, పేతురు, బీసన్న, వీరన్న, ప్రకాశ్, గోకారి, సల్మాన్, లత్తీపురం నుంచి పరశురాముడు, వెంకటేశ్, పుల్లయ్య, బోయ పరశురాముడు, శివన్న, ఆంజనేయులు, ముష్టి సోమన్న తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే శనివారం మండలంలోని శివపురం, బసల్‌చెర్వు గ్రామాల్లో బీఆర్ఎస్ నియోజకవర్గ నేత హనుమంతు నాయుడు పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం బసల్‌చెర్వు మాజీ ఎంపీటీసీ భర్త రంగన్న, ఉప సర్పంచ్ రాముడు ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి కండువాలు కప్పిన ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోనేశ్, బీచుపల్లి, శ్రీములు, ఎండీ మాజ్, తిమ్మప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిన బసల్‌చెర్వు నాయకులతో నియోజకవర్గ నేత హనుమంతు నాయుడు

కాపరుల అభిమానం

మక్తల్, ఏప్రిల్ 12 : మక్తల్ మండలం రుద్రసముద్రంలో శనివారం గొర్రెల కాపరులు రజతోత్సవ సభ పోస్టర్లను గొర్రె పిల్లలకు అతికించి కేసీఆర్‌పై ఉన్న అభిమానాన్ని చాటారు. అలాగే పార్టీ నాయకులు రాములింగం, ఆనంద్ తదితరులు మక్తల్ మండలంలో వాల్‌పోస్టర్లను అంటించి సభకు తరలిరావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మక్తల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌తో గొల్లకురుమల సంబురం

నా భర్త మరణానికి హిజ్రాలే కారణం

- మృతుడు రామకృష్ణ భార్య ఆరోపణ
- బంధువులతో కలిసి గద్వాల ప్రభుత్వ దవాఖాన ఎదుట ధర్నా

ధర్నా చేస్తున్న రామకృష్ణ కుటుంబ సభ్యులు

గద్వాల అర్బన్, ఏప్రిల్ 12 : తన భర్త మృతికి హిజ్రాలే కారణమని.. ఘటన రెండు రోజులైనా వారిని అదుపులోకి తీసుకోకుండా తమకు అన్యాయం చేస్తున్నారని మృతుడు రామకృష్ణ భార్య కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి బైఠాయించి ధర్నా చేపట్టారు. తన ఆవేదనను వెళ్లగక్కుతూ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా, బంధువులు అడ్డుకున్నారు. అనంతరం బాధితురాలు కృష్ణవేణి మాట్లాడుతూ తన భర్త మరణానికి హిజ్రాలే కారణమని, అతడిని లోబర్చుకొని తమలో కలుపుకోవడానికి ప్రయత్నించారని ఆరోపించారు. హత్య చేసిన హిజ్రాలను వెంటనే అరెస్టు చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ధర్నా చేస్తున్న వారిని అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేయగా, వాగ్వివాదం చోటుచేసుకున్నది. అనంతరం పోలీసులు బాధిత కుటుంబంతో మాట్లాడి.. రామకృష్ణ మరణానికి కారణమైన వారిని గుర్తిస్తామని, దోషులు ఎవరైనా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

లింగమయ్యా.. మమ్మేలవయ్యా

గుండంలో బారులుతీరిన భక్తులు

- సలేశ్వరానికి పోటెత్తిన భక్తులు
- నేటితో జాతర ముగింపు

అచ్చంపేట, ఏప్రిల్ 12 : నల్లమల అటవీప్రాంతం శుక్రవారం శివనామస్మరణతో మార్మోగింది. ఏడాదికోసారి జరిగే లింగమయ్య జాతరకు శనివారం చైత్ర పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. సాహస యాత్రగా చెప్పుకొనే జాతరకు ఎండను సైతం లెక్కచేయకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. గుండంలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. మన్ననూర్, ఫరహాబాద్, రాంపూర్, లింగాల, అప్పాయిపల్లి, గుర్జాగుండాల మీదుగా దారులన్నీ వాహనాలు, భక్తులతో కిక్కిరిసిపోయాయి. మూడు రోజులపాటు జరిగే జాతర రేపటి సాయంత్రంతో ముగియనున్నది.

శ్రీశైలం రోడ్డులో ట్రాఫిక్ జామ్..

చైత్రపౌర్ణమి సందర్భంగా సలేశ్వరం లింగమయ్యస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు తరలివచ్చాయి. మన్ననూర్ పాత చెక్‌పోస్టు నుంచి మూలమలుపు వరకు, మన్ననూర్‌లోని దుర్వాసుల చెరువు నుంచి మన్ననూర్ తండా వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

మన్ననూర్‌లో అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద టోల్‌పన్ను వసూళ్లు చేసేక్రమంలో వాహనాలు నిలిచిపోయాయి

శోభాయమానంగా..

గద్వాలలో హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు